## క్లుప్తంగా

### నేడు పింఛన్ల పంపిణీ

**ఫిరంగిపురం:** మండలంలోని 15 సచివాలయాల పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం శనివారం ఉదయం 5గంటల నుంచి ప్రారంభమవుతుందని ఎంపీడీవో వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వచ్చి పింఛన్ అందజేస్తారని గుంపులుగా ఒకేచోట ఉండి పింఛన్‌కోసం ఎదురుచూడవద్దని చెప్పారు. మొత్తం 9,202 పింఛన్‌దారులు ఉండగా రూ.3,98,51,500 నగదు పంపిణీ చేస్తారని తెలిపారు.

### సురక్షిత కాన్పుల కోసం కృషి



**ఫిరంగిపురం:** గర్భిణుల సురక్షిత కాన్పు కోసం ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని డాక్టర్ శాంతి అన్నారు. మండలంలోని గరుడాచలపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 156మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతి గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులకు పరీక్షలు చేయడం ద్వారా ప్రమాదకర లక్షణాలు గుర్తించవచ్చని తెలిపారు. గర్భిణులు ఆరోగ్య సిబ్బందికి సహకరించి వారు తెలిపిన ఆరోగ్య నియమాలు పాటించాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం



**ఫిరంగిపురం:** తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం పట్టభద్రుల ఎన్నికలపై అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించినట్లు తహసీల్దార్ జె.ప్రసాదరావు తెలిపారు. గ్రామంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేసి 205, 206 బూతులు కేటాయించినట్లు చెప్పారు. 205 బూత్‌లో ఓటర్లు పురుషులు 602, మహిళలు 392 మంది, 206 బూత్‌లో పురుషులు 719, మహిళలు 364 మంది ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం వెయ్యిమందికి మించి ఓటర్లు ఉన్నట్లయితే మరో బూతు కేటాయించాలనే నిబంధన ఉండటంతో, పలు పార్టీల నాయకుల సూచనల మేరకు 206ఏ బూత్ అనగా 9వ తరగతి బీ సెక్షన్ కేటాయించాలంటూ ఉన్నతాధికారులకు తెలియజేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### కుక్కల బెడద నివారణకు కాల్ సెంటర్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్

**మంగళగిరి (తాడేపల్లిరూరల్):** మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో కుక్కల బెడదతో ఇబ్బందులు పడుతున్న ప్రజల సౌకర్యార్థం కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ అలీమ్‌బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీన సాక్షి దినపత్రికలో ''కుక్కలు.... భౌబోయ్'' శీర్షిక రావడంతో స్పందించిన అధికారులు కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. వీధి కుక్కల సమస్య ఎక్కడైనా ఉంటే వెంటనే 70939 12653, 0864 5295192 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందుకున్న వెంటనే మున్సిపల్ సిబ్బంది వచ్చి కుక్కలను పట్టుకుని కేంద్రాల్లో వ్యాక్సిన్ వేసే దిశగా చర్యలు తీసుకుంటామని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

### నాయకత్వ లక్షణాలతో ఉజ్వల భవిష్యత్తు



**రావెల(తాడికొండ):** విద్యార్థులు బాల్యంలోనే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడం ద్వారా బంగారు బాటలు వేసుకోవచ్చని వర్సటైల్ సర్వీసెస్ ట్రస్ట్, శ్రీ కృష్ణ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ పాశం శ్రీ కృష్ణదేవరాయ యాదవ్, సభ్యుడు మురళీ కృష్ణ యాదవ్ అన్నారు. శుక్రవారం తాడికొండ మండలం రావెల గ్రామంలో టెన్త్, ఇంటర్ విద్యార్థులకు ట్రస్టు ద్వారా పరీక్ష మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ శరత్ బాబు మాట్లాడుతూ విద్యార్థులకు టైమ్ మేనేజ్‌మెంట్, గోల్ పెట్టుకొని ముందుకెళితే విజయాలు సులువుగా సాధించవచ్చన్నారు. ఏర్పాటు చేసుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు ప్రణాళికతో పాటు, సమయస్ఫూర్తి ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం చిన్నారులకు స్టడీ మెటీరియల్స్, ఎగ్జామినేషన్ కిట్స్ అందజేశారు. హెచ్ఎం శివకుమారి, ట్రస్టు వలంటీర్ ఆనంగి కృష్ణ తేజ యాదవ్, సాయితేజ, జస్వంత్ పాల్గొన్నారు.

# నేటి నుంచి 'రియల్' బాదుడు

- భారీగా పెరగనున్న మార్కెట్ వ్యాల్యూ
- మంగళగిరి పరిధిలో 25 నుంచి 130 శాతం పెంపు
- ఇప్పటికే పడకేసిన రియల్ ఎస్టేట్ రంగం
- తాజా పెంపుతో పతనమేనంటున్న రియల్టర్లు



క్రయ, విక్రయదారులతో కిటకిటలాడుతున్న మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం





మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

**తాడేపల్లిరూరల్:** పెరిగిన విద్యుత్ చార్జీలు..! ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు..! తారెత్తిస్తున్న కూరగాయల రేట్లతో ప్రజలు హాహాకారాలు మిన్నంటిన వేళ... వారిపై మరో బాదుడు మోపేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. స్థలం, నూతన గృహాలను కొనుగోలు చేయాలనే సామన్యుల ఆశను చిదిమేసే దిశగా అడుగులు వేస్తోంది. మార్కెట్ విలువలను భారీగా పెంచి అందిన కాడికి దండుకోవడమే ధ్యేయంగా స్కెచ్ వేసింది. మంగళగిరిలో అత్యల్పంగా 25 శాతం నుంచి గరిష్ఠంగా 130 శాతం వరకు చార్జీలు పెంచడంతో రిజిస్ట్రార్ కార్యాలయానికి రావాలంటేనే సామన్యులు జంకే పరిస్థితి సర్కార్ తీసుకువచ్చింది.

**సామాన్యుల్లో ఆందోళన..**

భూ బాదుడుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా 25 శాతం 130 శాతం వరకు మార్కెట్ విలువను పెంచాలనే నిర్ణయం తీసుకుంది. అడ్డగోలుగా ఆదాయం పెంచుకోవడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం భారీగా రిజిస్ట్రేషన్ ఛార్జీల బాదుడుకు సిద్ధమైంది. దీనికి ముహూర్తాన్ని శనివారం ఖరారు చేసింది. వాస్తవానికి వీటిని జనవరి 1 నుంచి పెంచాలని భావించినా, కొన్ని కారణాలతో వాయిదా వేసింది. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభావం భూ క్రయ, విక్రయాలపై భారీగా ఉంటుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో భూములు, నివాస అపార్ట్ మెంట్లు, వాణిజ్య భవనాల విలువలు అమాంతం పెంచడంపై సామాన్య, మధ్య తరగతి వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచేది లేదంటూ కూటమి నేతలు ఎన్నికల ముందు ఇచ్చిన మాటను కేవలం ఎనిమిది నెలల్లోనే తప్పుతూ జనంపై బాదుడుకు సిద్ధమైంది.

**మంగళగిరిలో..**

మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో మంగళగిరి, తాడేపల్లితో కలిపి మొత్తం 21 గ్రామాలు ఉన్నాయి. ఇందులో సీఆర్డీఏ పరిధిలోని ఏడు గ్రామాలు వస్తాయి. ఈ గ్రామాల్లో మాత్రం మార్కెట్ విలువ పెరగలేదు. గతంలో ఉన్న మార్కెట్ విలువ అలాగే ఉంది. నవులూరు, కురగల్లు, కృష్ణాయపాలెం, నిడమర్రు, పెనుమాక, ఉండవల్లి, వెంకటపాలెం గ్రామాలు సీఆర్డీఏ పరిధిలోకి వస్తాయి. మంగళగిరి, తాడేపల్లి, ఇప్పటం, చినకాకాని, చినవడ్లపూడి, ఆత్మకూరు, కుంచనపల్లి, చిర్రావూరు, కొలనుకొండ, వడ్డేశ్వరం, గుండిమెడ, పెదవడ్లపూడి, నూతక్కి, రామచంద్రాపురం గ్రామాల్లో ప్రాంతాల వారీగా అత్యల్పంగా 25 నుంచి అత్యధికంగా 130 శాతం వరకు రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగనున్నాయి. సగటున 25 నుంచి 60 శాతం వరకు అన్ని ప్రాంతాల్లో చార్జీలు పెరుగుతాయి. మంగళగిరిలో గతంలో అత్యధికంగా చదరపు గజం రూ.24 వేలు ఉండగా అది ఇప్పుడు రూ. 40 వేలు అయ్యింది. అలాగే గుండిమెడలో గతంలో చదరపు గజం రూ.4 వేలు ఉండగా కొత్తగా వచ్చిన విలువతో రూ.8 వేలు అయ్యింది. తాడేపల్లిలో చదరపు గజం రూ.15 వేలు ఉండగా ఇప్పుడు దానిమీద 100 శాతం పెరిగి రూ.30 వేలు అయ్యింది.

**మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో మార్కెట్ విలువ (చ.గ.)**

| ప్రాంతం | పాత విలువ (రూ.ల్లో) | పెరిగాక (రూ.ల్లో) |
|---|---|---|
| మంగళగిరి | 24,000 | 40,000 |
| చినకాకాని | 5,000 | 8,000 |
| చినవడ్లపూడి | 1,650 | 3,000 |
| నూతక్కి | 2,300 | 5000 |
| పెదవడ్లపూడి | 2,800 | 6,000 |
| ఆత్మకూరు | 12,500 | 16,000 |
| రామచంద్రాపురం | 1,300 | 3,000 |
| తాడేపల్లి | 15,000 | 30,000 |
| ఇప్పటం | 2,300 | 5,000 |
| చిర్రావూరు | 1,550 | 4,000 |
| వడ్డేశ్వరం | 2,900 | 5,000 |
| కుంచనపల్లి | 6,000 | 10,000 |
| కొలనుకొండ | 3,600 | 6,000 |
| గుండిమెడ | 4,000 | 8,000 |

**రియల్ ఎస్టేట్ పతనమే**

మార్కెట్ విలువలను పెంచాలనే ప్రభుత్వం నిర్ణయం రియల్ ఎస్టేట్ రంగానికి ఆశనిపాతంలా పరిణమించింది. నిజానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మంగళగిరి నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంది. ప్లాట్ల కొనుగోలు నిత్యం జరిగేవి. దీంతో ఈ వ్యాపారంలోకి వివిధ రంగాల వారు ప్రవేశించారు. ఈ తరుణంలో కూటమి సర్కారు అధికారంలో వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ ఒక్కసారిగా కుదేలైంది. రిజిస్ట్రేషన్‌ల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. భూముల విలువలను భారీగా పెంచడం, దీన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీయనుంది. దీనిపై స్థిరాస్తి వ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది అయితే పిల్లల చదువులు, వివాహాలు, ఇతర అవసరాల నిమిత్తం ఉన్న కాస్త ఆస్తిని అమ్మకానికి పెట్టినా కొనేవారు లేక సామాన్యులు ఇబ్బందులు పడే పరిస్థితులు నెలకొంటున్నాయి. గతంలో నెలకు ఒక ప్లాట్ అయినా విక్రయించే వాళ్లు గత కొన్ని నెలలుగా ఒక్క ప్లాట్ కూడా విక్రయించలేని పరిస్థితి నెలకొంది. ఇప్పుడే అంతంత మాత్రమే ఉంటే రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుతో పరిస్థితి మరింత దిగజారిపోతుందన్న ఆందోళనలో ఆయా వర్గాలు ఉన్నాయి.

**రిజిస్ట్రేషన్ కార్యాలయం కిటకిట**

మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం క్రయ విక్రయాలతో గత రెండు రోజులుగా కిటకిటలాడుతోంది. శుక్రవారం ఒకటే పాత రేట్లతో రిజిస్ట్రేషన్లకు అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో క్రయ విక్రయదారులు ఒక్కసారిగా కార్యాలయాన్ని చుట్టుముట్టారు. మధ్య మధ్యలో సర్వర్ కాస్త మొరాయించడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు పత్రాలు చేత పట్టి బారులు తీరారు.

> **నేటి నుంచి పెంచిన చార్జీల అమలు**
>
> పెంచిన రిజిస్ట్రేషన్ చార్జీలు నేటి నుంచి అమలులోకి వస్తాయి. ఆయా ప్రాంతాల్లో భూములు, స్థిరాస్తుల విలువలను బట్టి ధరల్లో వ్యత్యాసం ఉంటుంది. చార్జీలు పెరగడంతో గడచిన రెండు రోజులుగా రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే వారి సంఖ్య ఎక్కువగా కనిపిస్తోంది. దళారులు, ప్రైవేటు వ్యక్తులను అనుమతించకుండా పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు చేపట్టాం.
>
> – బాల గురవయ్య, సబ్ రిజిస్ట్రార్, మంగళగిరి

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**తాడేపల్లి రూరల్ :** మంగళగిరి పట్టణ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గండాలయ్య పేట, కొత్తపేట, ఆర్అండ్ బీ బంగ్లా రోడ్డు, హాస్పిటల్ రోడ్డు, మెయిన బజార్, ఎయిమ్స్ గేట్, ఎకో పార్క్, ఇందిరానగర్, ఎల్‌బీ నగర్, ఆంజనేయ కాలనీ, క్యాంప్ ఏరియా, ఇప్పటం రోడ్డు, గణపతి నగర్, డీజీపీ కార్యాలయం, బాప్టిస్ట్ పేట, కొప్పురావు కాలనీ, పాత మంగళగిరి పరిధిలోని ఆత్మకూరు రోడ్డు, భగత్‌సింగ్ నగర్, పార్కురోడ్డు, నిడమర్రు రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్, తిప్పర్ల బజార్, బ్యాంక్ కాలనీ,మస్యం బజార్ ప్రాంతాల్లో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు నూతన విద్యుత్ లైన్ల నిర్మాణ నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

### ముగిసిన మరియ మాత ఆలయ వార్షికోత్సవాలు



**మేడికొండూరు:** మండలం కేంద్రంలోని మరియమాత ఆలయ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ప్రత్యేక దివ్య పూజా బలిని విచారణ గురువు గంజి బాలస్వామి వహించారు. సర్వ మానవాళి పాప పరిహారార్థమై సర్వ సృష్టికర్త ఏసుక్రీస్తు ప్రభువు ఈ లోకానికి మానవ అవతారిగా మరియమ్మ గర్భాన జన్మించాడని తెలిపారు. ప్రత్యేక దైవభక్తి పాటలు మహిళలు ఆలపించారు. భక్తులు కొవ్వొత్తుల సమర్పణ, రాత్రికి గ్రామ పుర వీధుల్లో మేళతాళాల నడుమ, బాణ సంచా పేల్చుతూ ప్రత్యేక ఊరేగింపు జరిగింది. విచారణల గురువులు, ఫాదర్లు, మత కన్యలు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు

**తాడికొండ:** అమరావతిలోని రైతులు, రైతు కూలీల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో కమిషనర్ కె.కన్నబాబు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అన్నారు. శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు పలువురు రైతులు తమ సమస్యలను ఆయా విభాగాల వారీగా అధికారులకు అందజేశారు. ఇందులో భూ వ్యవహారాలకు సంబంధించి- 51, అకౌంట్స్/ఫైనాన్స్ విభాగానికి సంబంధించి- 1, ఇన్ ఫ్రా-1, ల్యాండ్స్(సర్వే) -1, ల్యాండ్ స్కేప్, పర్యావరణం -1, సామాజిక అభివృద్ధి-1 ఫిర్యాదులు అందగా ఆయా సమస్యలు పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కేఎస్ భాగ్యరేఖ, పి.పద్మావతి, కె.స్వర్ణమేరి, బి.శ్రీనివాస నాయక్, ఏజీ చిన్నికృష్ణ, జి.భీమారావు, జి.రవీందర్ పలువురు తమసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ అమలు



మెల్లెంపూడిలో రాజశేఖర రెడ్డి విగ్రహానికి ముసుగు



మంగళగిరిలో రంగా విగ్రహానికి ముసుగు



యర్రబాలెంలో ఫ్లెక్సీ తొలగిస్తున్న సిబ్బంది

**మంగళగిరి (తాడేపల్లిరూరల్):** ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానానికి ఎలక్షన్ కమిషన్ షెడ్యూల్ ప్రకటించింది. ఎన్నికల కోడ్ రావడంతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రవర్తనా నియమావళికి అమలులోకి తీసుకువచ్చారు. శుక్రవారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో మహనీయులు, రాజకీయ నాయకుల విగ్రహాలకు నగరపాలక సంస్థ సిబ్బంది ముసుగులు వేశారు. రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, ప్రైవేటు భవనాలు, బస్ షెల్టర్లు, బస్టాండ్లు, డివైడర్లపై రాతలను తొలగించారు. రహదారులకు ఇరువైపులా ఉన్న ప్రచార బోర్డులు, ఫ్లెక్సీలు, అతికించిన గోడ పత్రికలను తొలగించారు. అనుమతులు లేకుండా ఎవరైనా ఏర్పాటు చేస్తే చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

## అంకిత భావమే గుర్తింపు తెచ్చిపెడుతుంది



రమణయ్య దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

**తాడికొండ:** విధి నిర్వహణలో అంకిత భావమే తగిన గుర్తింపు తెచ్చిపెడుతుందని మాజీ ఎమ్మెల్సీలు రాయపాటి శ్రీనివాస్, ఏఎస్ రామకృష్ణ అన్నారు. తాడికొండ ఎస్వీవీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంగా, సీనియర్ ఉపాధ్యాయుడిగా 38 సంవత్సరాలు సుదీర్ఘ కాలం పనిచేసి పదవీ విరమణ పొందిన ఎస్వీ రమణయ్య అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పాఠశాలలో ఎందరో ఎన్‌సీసీ విద్యార్థులను తీర్చిదిద్దిన రమణయ్య ఉపాధ్యాయ వృత్తిని అంకిత భావంతో నిర్వహించి, పలువురు ఉన్నత కొలువుల్లో స్థిరపడేందుకు తనవంతు కృషి చేశారని కొనియాడారు. అనంతరం అతిథులతో పాటు సీపీఎం రాష్ట్ర నాయకులు ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు ఎస్వీ రమణయ్య దంపతులను ఘనంగా సత్కరించారు. గుంటూరు మాజీ మేయర్ రాయపాటి మోహన కృష్ణ, ఏవో అమల, హెచ్ఎం ఏవీ వరప్రసాద్, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పీడిత ప్రజల సమస్యలపై గళమెత్తిన గద్దర్





గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐక్యవేదిక నాయకులు

**తెనాలిఅర్బన్:** బడుగు బలహీన వర్గాల్లో తన పాటల ద్వారా చైతన్యం తీసుకువచ్చిన కవి గద్దర్ అని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఐక్యవేదిక వ్యవస్థాపకులు అక్కిదాసు కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజా కవి గద్దర్ 76వ జయంతిని రైల్వేస్టేషన్ రోడ్డులోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1985లో కారంచేడు మారణకాండను ఖండిస్తూ అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. పేదల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషి మరువరానిదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ దుబాయ్‌బాబు, నాయకులు కుర్రా జశ్వంత్ యాదవ్, కె.జేసుబాబు, ఉన్నవ సల్మాన్, పెరికల అరుణ్‌కుమార్, సయ్యద్ ఖాదీ మస్తాన్ బబ్లూ, టి.శరత్, ఎ.బాబీ, షేక్ సాధిక్, బడుగు రమేష్, కె.స్వామి పాల్గొన్నారు.

### పశువులకు వైద్య పరీక్షలు

**ఫిరంగిపురం:** మండలంలోని హౌస్ గణేష్ గ్రామంలో శుక్రవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 11 పశువులకు గర్భకోశవ్యాధులకు పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ తెలిపారు. అలాగే 47 గేదెలు, 64 దూడలకు డీవార్మింగ్, 5 గేదెలకు సూడి పరీక్షలు చేసినట్లు చెప్పారు. పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

### ముగిసిన ప్రత్యేక సదరం క్యాంప్

**తెనాలిఅర్బన్:** తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరమ్ క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఉదయం 8.30 గంటలకే దివ్యాంగులు జిల్లా వైద్యశాలకు చేరుకుని నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు క్యాంపు జరిగింది. క్యాంప్‌లో నర్సారావుపేట ప్రభుత్వ వైద్యశాల ఈఎన్‌టీ డాక్టర్ ఎం.చంద్రబాబు, సత్తెనపల్లి డాక్టర్ మాధురిలు, బాపట్ల అప్తామాలజీ డాక్టర్ ఆషాకిరణ్, నర్సారావుపేట నుంచి వచ్చిన డాక్టర్ ఎస్.హేమశ్రీలు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు వచ్చే వారం కూడా బుధ,గురు, శుక్ర వారాల్లో క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు.

### సచివాలయ ఉద్యోగి రాజేష్‌కు డాక్టరేట్

**కొల్లిపర:** మండల కేంద్రమైన కొల్లిపర గ్రామంలోని సచివాలయం 1లో గ్రేడ్ 6 పంచాయతీ కార్యదర్శిగా(డిజిటల్ అసిస్టెంట్) గా విధులు నిర్వహిస్తున్న ఆరే రాజేష్ నాయుడు డాక్టరేట్ సాధించినట్లు డెమోక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ గ్రామ వార్డు సచివాలయం ఎంప్లాయిస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు బండి కళ్ళ సతీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామ సచివాలయంలో గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్నవారందరూ రాజేష్ నాయుడు ను ఘనంగా శాలువాలతో, పూలమాలతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భగా ఉద్యోగులు మాట్లాడుతూ రాజేష్ కేఎల్ యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం నుంచి 'నోవెల్ అప్రోచెస్ పర్ డిటెక్షన్ ఆఫ్ ఏ ఎఫ్ యు అండ్ బ్రెయిన్ ట్యూమర్ త్రు ఇమేజ్ ఫ్యూజన్' అనే అశంపై డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. దీనరాజు, రామ్మోహన్, రవిబాబు, ప్రదీప్, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



కార్మికుల మద్దతు తెలిపిన దుర్గారావు, స్టీవెన్

**తాడేపల్లిరూరల్:** కూటమి ప్రభుత్వం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలోని సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షను ఆయన యూనియన్ నాయకుడు కూరపాటి స్టీవెన్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ చేతిలో చిల్లి గవ్వ లేక, అనారోగ్యానికి గురై, మానసిక వేదనతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్మికుల దుస్థితికి పాలకపక్షాలే కారణమని ఆరోపించారు. కార్మికులకు మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. చినరామయ్య, కె. ఆదినారాయణ, పిచ్చయ్య, వై. సాంబయ్య, బి.దానయ్య, దుర్గాభవాని, రమాదేవి, సూర్యప్రకాష్, బాష, నాగేశ్వరరావు, సామ్రాజ్యం, శివనాగలక్ష్మి, మాణిక్యాలరావు పాల్గొన్నారు.

## పాత పద్ధతిలోనే దూర విద్య పరీక్షలు నిర్వహించాలి



ఉన్నత విద్యామండలి కార్యదర్శి రాధాకృష్ణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**మంగళగిరి (తాడేపల్లిరూరల్):** శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ దూర విద్యా విభాగంలో జరుగనున్న డిగ్రీ పరీక్షలను పాత పద్ధతిలోనే నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాల నిర్ణయం వల్ల విద్యార్థుల భవిష్యత్తు అంధకారమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరంలో పరీక్షలు నిర్వహిస్తామని చెప్పిన యూనివర్శిటీ అధికారులు ఇప్పటికే రెండుసార్లు వాయిదా వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డేబే నిబంధనల ప్రకారం యూనివర్శిటీ పరిధిలో పరీక్షలు నిర్వహించాల్సి ఉన్నా, గతంలో విద్యార్థులు శ్రేయస్సు దృష్ట్యా యూనివర్శిటీ అనుబంధ కళాశాలల్లో నిర్వహిస్తూ వచ్చాయని చెప్పారు. కానీ ఇప్పుడు యూనివర్శిటీ పరిధిలో పరీక్షలు చేపడతామంటే రాష్ట్రం నలుమూలల నుంచి వందల కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఉన్నత విద్యామండలి కార్యదర్శి రాధాకృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఎఐఎఫ్ఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వల్లా రాజు, బందెల నాసర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయికుమార్, గుంటూరు జిల్లా కార్యదర్శి యశ్వంత్, సహాయ కార్యదర్శి అమర్‌నాథ్ పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలను అమలు చేయాల్సిందే



సమావేశంలో మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్

**మంగళగిరి (తాడేపల్లిరూరల్) :** ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాల్సిందేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని కార్యాలయంలో ఏరియా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని ఎన్నికల ముందు ఇచ్చిన మాటను ఖచ్చితంగా నెరవేర్చాలని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని సాకు చెప్పడం సరైనది కాదని విమర్శించారు. రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వాలు ఉన్నాయని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళతానని చెప్పి ప్రజల్ని మోసం చేశారన్నారు. నియోజకవర్గంలో 20 వేల మందిపేదలకు ఇళ్లపట్టాలు ఇస్తానన్న హామీ హామీగానే మిగిలిపోయిందన్నారు. ఇల్లులేని నిరుపేదలకు వెంటనే స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### ఘనంగా తెలుగు బాప్టిస్టు చర్చి వార్షికోత్సవం



**తెనాలి:** దేవుని కృప ప్రజలందరిపైన ఉండాలని, ప్రతిష్ఠ వార్షికోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అన్నారు. రూరల్ మండలం గ్రామం కొలకలూరులో తెలుగు బాప్టిస్టు సంఘం నాలుగో వార్షికోత్సవాన్ని శుక్రవారం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత పాస్టర్ నన్నెపాగ సురేష్ ప్రార్థనతో వేడుకలు ఆరంభమయ్యాయి. జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 'మాస్' వ్యవస్థాపక అధ్యక్షుడు సుద్దపల్లి నాగరాజు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఉన్నం ధర్మారావు మాదిగ, సంఘ ప్రెసిడెంట్ ఉన్నం ప్రేమయ్య, వైస్‌ప్రెసిడెంట్ అత్యాల చిట్టిబాబు, సెక్రటరీ సుద్దపల్లి పెద్దబ్బాయి, జాయింట్ సెక్రటరీ కొలకలూరి రవిబాబు, ట్రెజరర్ కొలకలూరి సత్యం, జాయింట్ ట్రెజరర్ ఉన్నం భాస్కరరావు, కొలకలూరి రాజయ్య, సురేష్ ఏలియా తదితరులు పాల్గొన్నారు.